క్లుప్తంగా

గంగారం ఎస్సైగా రవి కుమార్



గంగారం: గంగారం నూతన ఎస్సైగా రవి కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కమిషనరేట్ నుంచి బదిలీపై గంగారం వచ్చారు. అనంతరం సిబ్బంది బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ



మహబూబాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్ కల్పించాలని టీబీసీయూఎస్ జిల్లా అధ్యక్షుడు డి.ఓంకార్ డిమాండ్ చేశాడు. తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా సంఘం డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, స్వప్న, సునీత, విద్యాసాగర్, శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్



కేసముద్రం: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బేరువాడ గ్రామానికి చెందిన బోనగిరి ఉపేందర్‌ను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహరెడ్డి శనివారం తెలిపాడు.

వాటర్‌కూలర్ వితరణ



బయ్యారం: బయ్యారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.50వేల విలువైన 80లీటర్ల వాటర్ కూలర్‌ను శనివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు రవీందర్‌నాయక్, కమల్, స్వరూప, రైసా, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధుతోపాటు పలువురు నాయకులు శనివారం సందర్శించారు. ఈమేరకు హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థినులతో వారు మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయాన్ని పైఅధికారులకు తెలపకపోవడం సరికాదన్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండ్ల రాకేష్, వెంకటేష్, వినయ్, ప్రణయ్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట: గృహజ్యోతి పథకంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని పడమటిగూడెం గ్రామంలో శనివారం గృహజ్యోతి పథకం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 200యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించే వారు ఈనెల నుంచి విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

భూకబ్జాకు యత్నం

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని మహాగాయత్రీ దేవాలయ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు శనివారం తెలిపాడు. ఆలయ భూమిని కబ్జా చేసేందుకు హద్దు ఖనీలను కూలగొట్టి, తనను బెదిరిస్తున్నారని టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భూకబ్జాదారులతో తనకు ప్రాణభయం ఉందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

పకడ్బందీగా పరీక్షలు

డోర్నకల్: స్థానిక డీడీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతోంది. తహసీల్దారు కె.కృష్ణవేణి, సీఐ బి.ఉపేందర్‌రావు పరీక్ష ప్రారంభానికి ముందే పరీక్ష కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఫోన్లు లోపలికి అనుమతించడం లేదు.

పెసరకు పల్లాకు తెగులు



అజ్మీరాతండాలో పల్లాకు తెగులు సోకిన పెసరపంట

- ఆందోళనలో రైతులు
- 1500 ఎకరాల్లో సాగు

మరిపెడ రూరల్: రబీలో సాగు చేసుకున్న పెసర పంటకు పల్లాకు తెగులు సోకుతోంది. దీంతో పెసర ఆకులపై పసుపు, ఆకుపచ్చ మచ్చలు కనిపిస్తున్నాయి. తెల్లదోమ వల్ల ఈ తెగులు సోకుతుందని, తెగులు సోకిన పెసర పంటకు దిగుబడి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరిపెడ మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌కు సుమారు 1500 ఎకరాల్లో రైతులు పెసర సాగు చేశారు. తెగులు సోకిన పెసన పంటలోని మొక్కల ఎదుగుదల దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా తక్కువ మోతాదులో పూత, కాత ఉంటుందని, వీటి కాయలు కూడా చిన్నగా, సన్నగా ఉండి గింజలు కూడా నాణ్యతా ్రలోపంతో ఉంటాయని పలువురు రైతులు చెబుతున్నారు. కల్తీ పెసర విత్తనాలతోనే తమకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత పెసన సాగు రైతులు కోరుతున్నారు.

విత్తనాల్లో నాణ్యతా లోపం



పెసర విత్తనాల్లో నాణ్యతా లోపం కారణంగా పెల్లాకు తెగులు సోకుతుంది. బేమిసియా టబాసి అనే తెల్లదోమ వల్ల సంక్రమిస్తుంది. ఈ తెగులు నివారించడానికి ఎటువంటి నియంత్రణ పద్ధతులు లేవు. సాగు చేసుకునే సమయంలో తెగులు నిరోధక పెసర విత్తనాలు రైతులు ఎంచుకోవాలి.

– వీరసింగ్, మండల వ్యవసాయ అధికారి

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్2 నాటికి పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిరుద్యోగులతో శనివారం సంబురాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు శంతన్ రామరాజు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే పట్టభద్రుల, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు కమ్మగాని కృష్ణమూర్తి, రావిశెట్టి చంద్రశేఖర్, ఎడ్ల రమేష్, గోనె శ్యామ్, అంబటి మహేందర్ రెడ్డి, మిట్టకంటి నరేష్ రెడ్డి, స్వామి నాయక్, ఫయాజ్, రాజమ్మ పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకునేందుకే ట్రస్ట్



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని నిరుపేదలను ఆదుకునేందుకే హనుమాండ్ల ఝాన్సీ, రాజేందర్‌రెడ్డి ట్రస్ట్ నిరంతరం సేవ కార్యక్రమాలు చేపడుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమ్మాపురం, గుర్తూరు, సోమారం గ్రామాల్లోని నిరుపేద మహిళలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేదలు, దివ్యాంగులు, అనాథలకు చేయూతనిచ్చేందుకు హనుమాండ్ల ఝాన్సీ, రాజేందర్‌రెడ్డి ట్రస్ట్ నిరంతరం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తిరుపతిరెడ్డి, కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సోమయ్య, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కాలనీ సమస్యలను వివరిస్తున్న సోమయ్య

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శివారు కాలనీల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని నున్న నారాయణనగర్ కాలనీతోపాటు ఇతర కాలనీలను సందర్శించి సమస్యలను శనివారం తెలుసుకున్నారు. ఈసందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అసంపూర్తిగా వదిలేసిన మిషన్‌భగీరథ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ డీఈ ఉపేందర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పంజాల ఉపేంద్ర, జంగా కళావతి, కుడకంటి అనిత, అనూష, రహీం, సైదులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బాతుక స్వర్ణలత అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వర్ణలత మాట్లాడారు. ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. నిరుద్యోగుల కల సాకారం చేసే దిశగా మెగా డీఎస్సీ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ కోసం కష్టపడిన మహిళలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి, రాధిక, అనురాధా, పల్లవి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పాయం చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్: విప్లవ పార్టీల ఐక్యత సందర్భంగా నేడు ఖమ్మం జిల్లాలో జరిగే బహిరంగ సభకు విప్లవ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులను విధ్వంసం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు పూనెం ప్రభాకర్, వెలుకురు జగ్గన్న, ముంజంపల్లి వీరన్న పాల్గొన్నారు.

'విద్యాహక్కు చట్టం నిర్వీర్యం'

గార్ల: ప్రభుత్వ ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులను ప్రకటించకపోవడం విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు భూక్యా వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్‌లో 3లక్షల మంది శిక్షణ పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదిన వేడుకల కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 6నుంచి 8వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని, భక్తులు పాల్గొని శివపార్వతుల దీవెనలు పొందాలని కోరారు. కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



కేసముద్రం: కల్వల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కేసముద్రం: మండలంలోని అన్నారం గ్రామంలో గల యూపీఎస్‌లో, కల్వల ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం బండారు నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని కొమ్మనపెల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయిపెల్లి యాకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తొర్రూరు రూరల్: కొమ్మనపెల్లి తండాలో..

వసతులు కల్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కురవి: మండల కేంద్రంలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల కోసం నూతనంగా నిర్మించిన భవనంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నూతన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన భవనంలో ఎలాంటి వసతులు లేవన్నారు. ప్రారంభానికి ముందుగానే అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక వీరేందర్, మహేష్, గణేష్, నరేష్, మురళీ, నవీన్, వెంకీ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై కేంద్ర ప్రభుత్వ ఉక్కుపాదం



కేసముద్రం: మాట్లాడుతున్న మంద భాస్కర్

కేసముద్రం: కార్మికులు సాధించుకున్న చట్టాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో సంఘం అనుబంధ హమాలీ యూనియన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అనేక సంవత్సరాలుగా పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కార్మిక చట్టాలను సంస్కరణ పేరుతో పాలకవర్గాలు కాలగర్భంలో కలపాలని చూస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల సహాయ కార్యదర్శి దాసరి లింగస్వామి, వెంకన్న, మౌలానా, చంద్రయ్య, రమేష్, వెంకన్న, ఉప్పలయ్య, హుస్సేన్, రవి, యాకయ్య పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో'ను విజయవంతం చేయాలి



నెహ్రూసెంటర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెహ్రూసెంటర్: నేడు జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లీలా అన్నారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు శనివారం ప్లాకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమాదేవి, రామరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటినుంచి పల్స్‌పోలియో

డోర్నకల్: మండలంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. 3,192 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఉదయం ఏడు గంటలకు పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభం కానుంది. పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నజీర్ సిద్దిక్

మహబూబాబాద్: శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏబీసీ ప్రొడక్టివిటి కోఆర్డినేటర్ నజీర్ సిద్దిక్ అన్నారు. దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మిక్స్‌డ్ సంస్థ సహకారంతో జిల్లా కేంద్రంలోని వెల్పుల సత్యంనగర్ కాలనీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ద్వారా సర్టిఫికెట్‌తోపాటు సబ్సిడీ రుణాలు పొందవచ్చన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు లోకేష్ మాట్లాడుతూ.. దైవ కృప వెల్ఫేర్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బానోత్ వీరన్న, ఉప్పలయ్య, అరుణ్ పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ

పెద్దవంగర: అన్నం పరబ్రహ్మ స్వరూపమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ తమ్మెర లక్ష్మీనర్సింహారావు వేలూరి శారద అన్నారు. ఎదునూరి ఆగయ్య జ్ఞానకార్థం తన కూమారుడు శ్రీనివాస్ రేణుక దంపతులు జిల్లా గవర్నర్ వెంటేశ్వర్‌రావు అదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఆంగస్ రిలీఫ్ చైర్మన్ దామెర సురేష్, లయన్స్‌క్లబ్ మండల సెక్రటరీ వెంకన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

4న రాష్ట్ర కమిటీ సమావేశం

నెహ్రూసెంటర్: ఈనెల 4వ తేదీన సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో జరగనున్న మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు ముంజాల రాజేందర్‌గౌడ్ తెలిపాడు. శనివారం ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల సంఘం బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అపరిచిత వ్యక్తి పోలీసులకు అప్పగింత

నెల్లికుదురు: ఓ అపరిచిత వ్యక్తిని గమనించిన స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈసంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. నెల్లికుదురు మండలం సీతారాపురం గ్రామ శివారు రేకుల తండాకు చెందిన గిరిజన వ్యక్తి మద్యం మత్తులో తిరుగుతున్నట్లు తెలుసుకుని మత్తు వదిలిన అనంతరం వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

సోలార్ లైట్ల ఏర్పాటు

మరిపెడ రూరల్: మండలంలోని డీఎస్ఆర్‌జెండాల్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ఎంపీ మాలోతు కవిత అభివృద్ధి నిధుల నుంచి కేటాయించిన రూ.5లక్షలతో సోలార్ విద్యుత్ దీపాలను పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య రమరెడ్యా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నగూడూరు: ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఝాన్సీ శనివారం తెలిపారు. పట్టుబడిన మూడు ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

16న లోక్‌అదాలత్

కేసముద్రం: జిల్లా కేంద్రంలో ఈనెల 16న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలలో వన్యప్రాణి దినోత్సవం

కేసముద్రం: మండలంలోని నర్సింహులగూడెం జీపీలో గల ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులు జంతువుల మాస్కులను ధరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొడిపాక రమేష్, ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయంతో జీపీ నిర్మాణం

మరిపెడ రూరల్: గ్రామస్తుల అభిప్రాయం మేరకే గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి రాజు అన్నారు. శనివారం గ్రామ కార్యదర్శి రామోజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా ప్రత్యేక అధికారి హాజరయ్యారు. పాత పాఠశాల ఆవరణ సమీపంలోనే జీపీ నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు, దీనికి ప్రజలంతా ఏకభిప్రాయం వ్యక్తం చేసినట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. దీంతో కొద్ది రోజులుగా చోటుచేసుకున్న గందరగోళ వాతావరణానికి తెర పడినట్లయింది.

స్ఫూర్తిగా తీసుకోవాలి

డోర్నకల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనుగోజు సత్యనారాయణ చేసిన పోరాటాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు జి.రాములు కోరారు. శనివారం మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన అనుగోజు సత్యనారాయణ సంతాప సభలో జి.రాములు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, గురవయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శికి పితృవియోగం

గార్ల: బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్ తండ్రి లింగాల సూరయ్య(65) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో గురువారం మృతిచెందిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించగా వారికి అప్పగించినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. విజయవాడకు చెందిన బత్తుల సింధు గార్ల మండల కేంద్రానికి చెందిన తన తల్లి బల్లెం వెంకటమ్మ ఇంటి వద్ద ఉంటుంది. సింధుకు కడుపులో నొప్పిరాగా చికిత్స నిమిత్తం కొద్ది రోజుల క్రితం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె వాటర్ ప్లాంట్ సమీపంలో ఫిట్స్ వచ్చి పడిపోయి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అనంతరం టౌన్ ఎస్సై చల్ల అరుణ, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎల్‌ఓసీ అందజేత

గార్ల: అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె షాహిదాబేగంకు ఎమ్మెల్యే కోరం కనకయ్య రూ.2,50,000 ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేశారు. ఇటీవల షాహిదాబేగం ఇంట్లో జారిపడగా, తలకు బలమైన గాయమై నరాలు దెబ్బతిని కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. భర్త ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎల్‌ఓసీని మంజూరు చేయించి, కార్యకర్తల ద్వారా బాధితురాలికి అందజేశారు. షాహిదేబేగం భర్త హుస్సేన్ బాల్య మిత్రులు రామారావు, తోడేటి శ్రీను రూ.34,000 నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

దంతాలపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు అయిన సంఘటన మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 26న షేక్ రేష్మ(22) తల్లిదండ్రులు పనుల నిమిత్తం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి తమ కూతురు రేష్మ కనిపించలేదు. చుట్టపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. తండ్రి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

జాతర పనులు ముమ్మరం



కురవి: ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి నుంచి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా జరగబోయే జాతర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన ఆలయాలకు రంగులు వేయడం పూర్తి చేశారు. భద్రకాళీ అమ్మవారి ఆలయం, సత్రాలు, కల్యాణ కట్ట వద్ద చలువ పందిళ్లను శనివారం ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ ఈఓ సత్యనారాయణ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.